


# జ్యోతిష్యం నిజం అవుతుందా!

*నమ్మకం అన్నిటికీ అతీతమైనది ఉంటే ఒక చిక్కు; లేకపోతే ఇంకొక చిక్కును నమ్మకం లేకపోవడం కూడా ఒక నమ్మకమే, మరి.*

**'శ్రీ సుభా'**

**ఆనందరావు** పదిహేడవ సంవత్సరపు జీవితసోపానంమీద అడుగు మోపేంతవరకూ తన పేరును రుజువు చేసుకుంటూనే పెరిగాడు. కానీ సరిగా పదిహేడవ సంవత్సరం ప్రవేశించిన రోజునే తల్లి చనిపోతూ చనిపోతూ, అతని చెవినొక విషాదవార్త వినిపించి మరీ కన్ను మూసింది.....

నూనూగు మీసాలు వచ్చాయి. మగతనం ఎక్కుపెట్టిన విల్లు సాగుతున్నది శరీరంలో. ఆశలూ, కోరికలూ కొద్ది కొద్దిగా, ప్రకృతి దయతో వదిలే నదిలో నీరులా — వయస్సు ఆనకట్ట దాటి శరీరం అనే సొంత పొలంలోకి తగు పాళ్లలో సరఫరా అవుతూ వచ్చాయి. ఆ శరీరం లోంచే ఓ పక్కనుంచి చదువులాంటి [illegible]ంట కాళ్ళ కూడా పరుగెడుతున్నది. అతనికి తెలియకుండానే నిత్యావసరాల నారుతోపాటు రెండు మూడు ప్రేమ విత్తులుకూడా శరీరంలో పడిపోయాయి. ఇక నేడో రేపో అవి మొలకెత్తి, పూవులు పూచి, సువాసనలు వెదజల్లినా ఎవరూ ఆశ్చర్యపడనక్కరలేదు. అలాంటి ఆనందరావుకు మరేం కావాలి? ఒకవేళ భగవంతుడే కలలో కనపడి, [illegible] లేపి "నీకేం కావాలో కోరుకో!" అంటే "థాంక్స్. నా కన్నీ ఉన్నాయ్. ఏం అవసరంలేదు" అని నిబ్బరంగా సమాధానం చెప్పగలడు ఆనందరావు.

కాని పదిహేడవ సంవత్సరం మొదటిరోజు తల్లి జబ్బుతో మంచంమీదనుంచి లేవలేని

స్థితిలో కన్ను మూయబోతూ, అతను జీవితంలో పొరపాటుగాకూడా కన్ను మూయడానికి వీలులేని విషాదవార్త చెప్పి మరీ చచ్చిపోయింది... అదే...ఆనందరావుకు త్రాచుపాము గండం ఉందిట. అది తప్పదని నల్లశాస్త్రులువారు ఈ ఆనందరావు భూమిమీద పడ్డరోజే జ్యోతిష్యం చెప్పారట...తల్లి చెబుతూంటే ఆనందరావు అంతగా భయపడలేదు. మనసులో "మూఢ విశ్వాసాలు" అనుకున్నాడు. కానీ పాపం ఆ ఇల్లాలు కంటతడి పెడుతూనే కొన్ని సాదృశ్యాలు చెప్పింది కొడుకు జాగ్రత్తకోసం, తన నలుసు భవిష్యత్తుకోసం. ఆనందరావు తాతగారు నల్లత్రాచు కాటేసి చచ్చిపోయారట. తండ్రికూడా కొడుకు పుట్టిన నాలుగు నెలలకు నల్లత్రాచు కరిచే కన్ను మూశారట....ఇవన్నీ చెప్పి, ఆవిడ లోకంనుంచి నిష్క్రమించింది. కాని ఆ మాటలు ఆనందరావును తేనెటీగల్లా చుట్టూచేరి రొద చెయ్యడం మొదలుపెట్టాయి. ఆనందరావును భయగ్రస్తుణ్ణి చేశాయి....

అప్పటినుంచే ఆనందరావు జీవితంలో రెండో మజిలీ ప్రారంభమయింది. అది పోరాటం, భయంనుంచి దాక్కోవడం, జ్ఞాపకాల్ని తల్చుకు తల్చుకుని కుమిలిపోవడం. పాపం ఎవరితోనన్నా చెప్పుకోవాలని ఆశ పుట్టినా వేళాకోళంచేసి "పోవోయ్ పుల్కాయ్" అంటారని దిగులు. నిబ్బరంగా ఉండాలనుకుంటే అదీ కుదరదు. అతనికి ప్రాణ స్నేహితులు లేరు, వారితో చెప్పుకుని బాధను మరిచిపోదామంటే. ఒక్క ఏడాదిలో ఆనందరావు విషాదమూర్తి అయ్యాడు. శరీరం బీడుగా మారి ఎడారి కాబోతున్నది. నాటిన సంతోషాలు, కోరికలు, ఆశలు కోరలు పెంచుకుని బ్రహ్మజెముడు వేళ్ళు వేస్తున్నాయి. శరీరం నిండుగా పాముల పుట్టలు. రక్తం విషరూపంలో ప్రవహించి మలినం చేస్తున్నది.

ఆనందరావు పరిస్థితి చూసి శరీరమే జాలేసి కొంచెం ధైర్యం సరఫరా చేసేది—"నీకేం ఫర్వాలేదు. పెద్ద పట్టణంలో బ్రతుకు. అక్కడే చదువుకుని స్థిరపడు. ఏమిటిది ఇలా బెంబేలు పడిపోతావు!" అని. ఆ ప్రోత్సాహంతోనే ఆనందరావు పినతండ్రితో దెబ్బలాడి పల్లెటూరి చదువు చదవనన్నాడు. పట్నం మకాం మార్చాడు.

ఆనందరావు ఇరవై సంవత్సరాలు వచ్చేసరికి విజయవాడలో బి. ఎ. ఆఖరి సంవత్సరం చదివే యువకుడుగా మారిపోయాడు. మనిషి కొంచెం రాటు తేలాడు. అందమైన మీసకట్టు పెంచాడు. కొంచెం వెనక ఆస్తి ఉంది కాబట్టే—అది హుందా రూపంలో, నీటైన ఫేషన్ల రూపంలో అతని ముందుకువచ్చి తొడుక్కునేది. అతని మిత్రులందరూ చాలా మంచివాళ్ళు, చిన్నప్పటే నుంచీ పరిచయమున్న వాళ్ళూను. "సుబ్రహ్మణ్యం", "సుబ్బారావు", "శేషగిరి" ఇత్యాది పేర్లు గలవారికి అతనికి తెలియకుండానే దూరంగా వెళ్ళిపోయేది మనస్సు. పాలుపోసి పెంచిన ప్రాణ స్నేహితుడే పామై కాటేయవచ్చు. కొద్దిగా సర్పం పేరు సూచించేవాళ్ళకు ఏనాడూ తన దగ్గర చోటివ్వలేదు ఆనందరావు. పైగా తనే దూరం పోయేవాడు. బి. ఎ. లో కూడా "శంకరం", "కృష్ణమూర్తి", "విష్ణుమూర్తి" ఇలాంటి వారితోనే స్నేహితంగా ఉండేవాడు. అవును....వాళ్ళ పేర్లలో ధీమా ఉంది; నిర్భయత్వం ఉంది! అప్పుడప్పుడు తన పేరు నచ్చేదికాదు... ఎవరు పెట్టారో! మార్చుకుంటే? చాలా మంది కారణం అడుగుతారు. లేనిపోని రభస. పైగా ఎందరో అమ్మాయిలు కూడా అతని పేరు "బ్యూటిఫుల్!" అని అనడం కూడా తెలుసు.

ఒకరోజు ఆనందరావు పినతండ్రి విజయవాడ వచ్చాడు. ఆయనగారి కుమారీరత్నాన్ని ఎవడో కాలేజీ కుర్రాడు లేవదీసుకుని వచ్చాట్ట........ వాడికి కొంచెం బుద్ధి చెప్పమనీ, పరువు నిలబెట్టమనీ ఆనందరావు ముందు వాపోయాడు. "కాలేజీ ప్రెసిడెంటువి. అంతా నీచేతుల్లోనే ఉంటుంది" అన్నాడు, అదేదో ఇండియా ప్రెసిడెంటు అంత హోదాది కాబోలనుకుని ఆయన.

ఆనందరావు వాకబుచేసి కొంచెం ఆరా తీయగలిగాడు. ఆ మజ్నూకూడా తన క్లాస్‌మేటే. పేరు "ఫణి" అని తెలిసింది. గుండె గుటకలు మింగింది.ఏదిదారి! అతనితో తనకు ఛేటీ ఏమిటి? తన ఆదర్శం, ఆశ ఏమవ్వాలి?? పోనీ, "చిన్నాన్నా, నేనీ విషయంలో జోక్యం జేసుకోను" అంటే, అదీకుదరదు. పైగా, ఆయనగారు "ప ఆనందరావు తలుచుకుంటే నిన్నేమయినా చెయ్యగలడు. వాడికి కాలేజీ అధికారులు, వాళ్ళుకాక పోతే గవర్నమెంటు అండ ఉంది" అంటూ తనకన్న ముందు వెళ్ళి వాడిని బెదిరించాట్ట. వాడు మాత్రం తక్కువ తిన్నాడా? వాడి మార్గాలు ఈపాటికి సుగమం చేసుకునే ఉంటాడు.

"ఏరా, నట్టాట్లో అలా చూస్తావేమిటి? అత్తయ్యా, మీపిన్ని యేడుపులు చూడలేకుండా ఉన్నాను" అన్నాడు పినతండ్రి.

ఆనందరావు ఆలోచించాడు. వసుదేవుడి కథ గుర్తుకు వచ్చింది. ఓమూల తల్లిమాటలు వినిపిస్తున్నాయి. కొంచెం తెలివి కావాలి. తన్ను తను నిలదొక్కుకున్నాడు. "సరే, చిన్నాన్నా" అన్నాడు. సరే అనే పదాన్ని నొక్కిపట్టి ఫణి గది తెలుసుకుని వెళ్ళాడు. ఆనందరావును చూడగానే వాడు బుస్ మంటూ లేచాడు. తన దగ్గర ఉన్న నాగస్వరం తీసి ఊదడం మొదలు పెట్టాడు, ఆనందరావు. జీవితంలోంచి ఆదర్శాలూ, వివాహం మీద పాటలూ పాడాడు. పెద్ద పెద్ద కవులలో కోక్తులు చెప్పాడు. జీవితం మీద, వివాహం మీద పలువురి అభిప్రాయాలు చెప్పాడు. వివాహం అంటే యిదన్నాడు. ప్రేమ విలువ భారీఎత్తుగా చూపించాడు. ఆఖరికి ఫణి


ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
చందాదారులకు
విజ్ఞప్తి!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కొరకు చందా పంపేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాము:

1. చందా పంపేటప్పుడు మనిఆర్డర్ కూపనులో కాని, ఉత్తరంలో కాని తమకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పంపాలని స్పష్టంగా వ్రాయాలి.

2. పాత చందాదారులు తమ చందా సంఖ్య ఉదాహరించాలి.

3. ఎంతకాలం పంపవలసినది స్పష్టంగా వ్రాయాలి.

4. గ్రామం పేరు, పోస్ట్ ఆఫీసు, ఏఊరుమీదుగా పంపవలసినది (అవసరమైన సందర్భాలలో), తాలూకా, జిల్లా మున్నగు వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాయాలి.

5. చందా మొత్తం 'మేనేజర్, ఆంధ్రప్రభ లిమిటెడ్, విసెంటురోడ్డు, గాంధీనగర్, విజయవాడ-3' చిరునామాకు పంపాలి.

సాలుచందా రు.15-60న.పై.
6 నెలలకు రు. 7-80 న.పై.
3 నెలలకు రు. 3-90 న.పై.

సదా చందాదారుల సహకారం అర్థిస్తున్నాము.

మేనేజరు.



తెల్లమచ్చలకు
ఉచిత వైద్యము

అనేక సంవత్సరముల పరిశోధన ఫలితముగా కనిపెట్టబడిన "సోమరాజి" ఆయుర్వేద ఔషధము తెల్లమచ్చలను నివారించును. ఒక చిన్న పిపామందు ఉచితముగా పంపబడును. ఇంగ్లీషులో వ్రాయండి.

**Bharat Chikitsa Kendra (G)**
P. O. Lal Bigha (Gaya)

అలివేలును పెళ్ళి చేసుకుందుకు ఒప్పుకున్నాడు. పైగా ఆనందరావును కౌగలించుకుని "నా కళ్ళు తెరిపించా"వన్నాడు.

పెళ్ళికి తన్ను రమ్మనమని శుభలేఖ వచ్చినా, ఆనందరావు కదల్లేదు. ఎందుకైనా మంచిదని, దూరం శ్రేయస్కరం అనీ, వేరే మిష పెట్టుకుని వాళ్ళను, ఊళ్ళో కాపురం అయినా చూసేవాడు కాదు.

ఆనందరావుకు అలా జీవితంలో ఒక గండం తప్పిపోయింది.

కొన్ని నెలల్లో ఆనందరావు బి. ఎ. పరీక్షకు కూచోబోతాడు. చక్కని సాయంకాలం సింగారం చేసుకుని అతను దుర్గగుడికి వెడితే అక్కడికి వచ్చింది..... ఊరంతా అతలో దీపాలు వెలిగించుకుని, ఉక్కిరి బిక్కిరి అవుతున్నది. దూరంగా ఉన్న కొండ చీకట్లో అలిగిన అమ్మాయి, నల్ల కాలువా కప్పుకుని బోర్లా పడుకున్నట్టుంది. ఇదేమిటి? శరీరంలో సగంభాగం, అప్యాయత, ఏదో తీయని తోడు కోరుకుంటే ప్రకృతి ప్రతికదలికా పడతిలాగే కన్పిస్తుందేమో!

"ఏమండీ?" అంది ఎవరో మగువ.

తను చూశాడు. కాలేజీలో తిరిగే అమ్మాయే కచ్చితంగా. కనుబొమలు అడిగాయి "ఏం?"అని. అనంపూర్తిగా విరదా విరించిన పీసాలోంచి బయటకు రావాలనే పాటియను తొవ్రతయంతా ఉంది నవ్వు పంటితో విరించడం చూస్తుంటే. కళ్ళు అరమోడ్పుగా అరవిందాలయ్యాయి. ఇంకోసారి అడిగాయి కళ్ళు. ఏమిటని,

ఆ అమ్మాయి కళ్ళు అలాగే చెప్పాయి—"నిన్ను ప్రేమిస్తున్నా"నని.

ఆశ్చర్యం అతని శరీరాన్ని చిటటికొట్టు చేసింది. అంతా చీకటి...

"వదలండి... ఎవరైనా చూస్తే?"

అగ్ని ఇుమీద మారిన గంధం పూస్తున్నట్టు నిప్పుకనా, చేతులకూ, మాటలురాని మల్లెలు కంతా నికే కితకితలు పెడుతున్నాయి.

"ఏం, నాలో ఏం లోపం?" అంది ఆ అమ్మాయిలో కోపం.

"ఇటువంటి పనులు పెళ్ళికాకుండ చెయ్యడం తప్పు" అన్నాడు ఆనందరావు.

"పెళ్ళి చేసుకోనని నే నన్లేదే?" అంది.

"వెంకటలక్ష్మీ, నన్ను క్షమించు" అన్నాడు.

"నేను...నాగమణిని... చీకట్లో వెంకటలక్ష్మి అని పొరపడ్డావేమో!" అంది నాగమణి నవ్వుతూ అతలు తిరిగి ఎదుగుతూంటే.

ఆనందరావుకు ఆ కొండమీదనుంచి పడిపోతున్న అనుభవం...నాగమణి... సర్పకన్య..అవును. అదే స్పర్శ...ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసాలుకూడా సరిగా అవే...కాటు వేయాలని వెదికే పాము పడగలాంటి అనుభవం శరీరంమీద.

"చూడు...ఇప్పుడు నాక్కొంచెం పనుంది... రేపు...ఆ బెరేజి దగ్గర...సరేనా...?"

"ఇంకేం!" అంది నాగమణి వెడుతూ. అదే నడక—పాము నడిచినట్టే. తలలో మణిలా రక్తవర్ణపు గులాబీ, మల్లెల ఛాయగాన్ని మింగుతూ ప్రకాశిస్తున్నది.

ఆనందరావుకు ఆ రాత్రి శివరాత్రి అయింది. లేచి గబగబా ఓ ఉత్తరం వ్రాసి 'అమ్మయ్యా' అనుకున్నాడు.

ఆ మరునాడు సాయంకాలం మాటా, మనసూ తప్పని నాగమణి ఆనందరావును కలుసుకుంది...'నువ్వు నా ప్రాణం' అంది. 'నేను నదినై సముద్రంలాంటి నీ హృదయంలోకి ప్రవహిస్తున్నా'నంది. బొత్తాలు సర్దుతూంది, అచ్చం పాము పాకుతున్నట్టే.

ఆనందరావుకు ఏం మాట్లాడాలో తెలియలేదు. "అదిగో చూడు...కృష్ణవేణి, నిండు గర్భిణిస్త్రీలా ఎంత నెమ్మదిగా ప్రవహిస్తున్నదో! ఆ రైలువట్టాలు, పాడం జీవిత ప్రయాణంలో అనంతంలో కాని కలుసుకోలేని ప్రేమికులు. ఆ రోడ్ను అందరూ తనమీద హాయిగా నడిచి పోతూంటే కష్టిట బాధిడను లేవుకునే వ్యక్తి చారులు." ఇలా ఇలా ఏదో కవిత్వం అల్లి చెప్పాడు తను—కాలాన్ని దొంగ వ్యాపారిలా అరగిస్తూ.

నాలుగు రోజులునాటికి నాగమణి తండ్రి వచ్చి కూతుర్ని నానా చివాట్లూ పెసినట్టూ, బహుశా చదువు మాన్పించి పెళ్ళిచేసే ఏర్పాటులో ఉన్నట్టూ తెలిసింది....

ఆనందరావు ఆ రోజు కాంతిగా నిద్రపోయాడు...తలుపు తట్టిన చప్పుడు...

"నువ్వా?" అన్నాడు తలుపు తెరిచి.

"నేనే ఆనందరావూ" అంది నాగమణి.

"ఏడుస్తావెందుకూ! ఇది ఏడుపు సీను కాదు" అన్నాడు నవ్వుతూ.

"నా జీవితం విషాదం అయింది. మన ప్రేమని పసిగట్టి మా నాన్న కెవరో ఉత్తరం వ్రాశారు. ఆయన నాకు పెళ్ళి స్థిరపరిచి చదువు మాన్పించి తీసుకుపోతానంటున్నాడు."

"ఎలా?" అన్నాడు.

"ఈ జీవితం ఇంతే—నన్నుమాత్రం మరిచి పోకేం?" అంది.

"ఛా! ఛా!" అన్నాడు.

నాగమణి అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూండమని, మరేం ఫర్వాలేదు, వీలైతే వాళ్ళింటికి రావచ్చుని చెప్పి అడ్రసిచ్చి వెళ్ళిపోయింది...

ఆనందరావు "ఓహో!" అనుకున్నాడు. మనస్సుంది—"పాపం, నిజంగా నిన్ను ప్రేమించిందేమో కనిపెట్టావా?" అని.


నాలుగు రోజుల్లో అదీ తేలిపోయింది. అసలు నాగమణి స్వభావమే అంతట. కాస్త వెనక ఆస్తి ఉన్నట్టు తెలిస్తే ఇదే పద్ధతి. సూర్యారావు దగ్గరకు చేరనివ్వలేదని వాళ్ళ నాన్నకు తనే ఉత్తరం వ్రాసిందట— 'మీవాడు చెడిపోయాడు. కాలేజీలో నాగమణి అనే అమ్మాయిని ప్రేమించి చాలా దూరం వెళ్ళా' డంటూ. అది నాగమణి స్వభావం. ఆ కాటునుంచి తను తప్పించుకున్నాడు...జీవితంలో మరో గండం తప్పిపోయిందనుకున్నాడు ఆనందరావు.

• • •

వయస్సు వివాహం చేసుకోమంది. ఒంటరి తనం శరీరంలో గెరిల్లా యుద్ధం చేస్తున్నది. భయం పోవాలంటే నువ్వు అన్నీ సమకూర్చుకోవాలంది శరీరంలో శంక. అందుకే ఓ ముహూర్తంలో ఆనందరావు గృహస్థుడయ్యాడు. భార్య పేరు కృష్ణవేణి. ఉత్తమా ఇల్లాలు. ఎప్పుడూ తను "కృష్ణా" అనే పిలిచేవాడు. అతని అతలు కలల్లో భయాన్ని ముక్కలు ముక్కలు చేసి పారేసేవి భార్యను అలా పిలవడంతో.

"అదేమిటండీ...ఏ...మొగాళ్ళ పేరెట్టి పిలుస్తారూ?" అనేది ఆ అమ్మాయి కొత్తలో.

"నాకిష్టం...పైగా మా ఇంటి దేముడు!" అనేవాడు. ఆమె జడను చేత్తో నిమురుతూ తన్మయత్వంలో.



బ్రతుకు భారం

చిత్రం—వి కృష్ణవేణి (మద్రాసు-17)

ఆ అమ్మాయి మురిసిపోయి..."మా ఇంటి కెప్పుడూ నా జడను చూసి నల్లత్రాచు అనేదండీ!" అనేది ఏకాంతంలో మరేం మాట్లాడాలో తెలియక.

ఆనందరావుకో తన్మయత్వం, తాదాత్మ్యం పొందుతున్న ఆనందం ఉలిక్కిపడేది.

"తప్పు. అలా విషజంతువులతో పోల్చుకో కూడదు" అనేవాడు...

ఆనందరావు ఇద్దరు పిల్లల తండ్రి అయ్యాడు...వాళ్ళకు విష్ణుమూర్తి, శంకరం అని పేర్లు పెట్టాడు...కృష్ణవేణి పోరుతూనే ఉంది—"మా మ గా రి పేరు ఒకళ్ళకైనా పెట్టండి" అని.

"తరువాత వాడికి" అనేవాడు నవ్వుతూ.

అంతే. కృష్ణవేణి సిగ్గుతో వెనక్కు తిరిగి వెళ్ళిపోయేది. నల్లని జడ అటూ ఇటూ కదిలేది వయ్యారంగా. కాదు, అతని చూపులకు భయంకరంగా.

# జ్యోతిష్యం...

"కృష్ణా, నువ్వు చక్కగా సిగముట్టుకో కూడదూ! పైగా ఈరోజుల్లో ఫేషన్‌కూడా" అన్నాడు ఓరాత్రి ఆ అమ్మాయి అతని బుగ్గమీద జడతో కొడుతూంటే.

"పెద్ద వాళ్లలా ఏం బాగుంటుందండీ?" అంది.

ఆనందరావు ఎలా చెబుతాడు? ఎలా చెప్ప గలడు??

ఆనందరావు ఉద్యోగం చేస్తున్నది కూడా విజయవాడలోనే. అదికూడా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంటులో ఉద్యోగం అయితే మంచిదే. కానీ ఎన్నో కష్టాలున్నాయి. లేనిపోని గొడవలు.

"ఈ ఉద్యోగం మానెయ్యమంటావా, కృష్ణా? ఎప్పుడూ ఎవళ్లనో ఒకళ్లని అనుమానించడం, అలాంటి సమయాల్లో నిర్దోషుల్ని పట్టుకోవడం. ఛీ! సంఘం తప్పొప్పుల్ని పట్టిచ్చే హోదాకి నేను తగను" అనేవాడు చేస్తున్న ఉద్యోగం గుర్తుకు వస్తే.

ఆఫీసులోకూడా అన్నీ మోసాలు, లంచం తీసుకోవడం, దోషుల్ని సోదరసంలా చేతుల్లోంచి జార్చేయడం. రెండు మూడు సార్లు తన అధికార హోదాతో హెచ్చరించాడు. వాళ్లు తను వాటాకోసం ఆశపడుతున్నాడనుకొని డబ్బు తీసుకువచ్చి అతని ముందు పెట్టారు.

"ఇది చాలా అన్యాయం....."

"అన్యాయం... ఇక్కడ కాదండీ... దేశం మొత్తంమీదే ఉంది. దీపాలు పెట్టి వెదక నవసరం లేకుండానే కన్పిస్తుంది కావాలంటే..."

"ఎవళ్లో గడ్డి తింటున్నారని మనం తింటామా?"

"కొందరు భోజనం సుష్టుగా ఉండికూడా గడ్డి తినడానికి ఆత్రుత పడుతూంటే, ఆకలి తీర్చుకోవడం కోసం, మరేంలేక గడ్డితింటే తప్పేండి?"

"గోపాలం!" అరిచాడు ఆనందరావు.

"నాపేరు శేషతల్పం" అన్నాడు నెమ్మదిగా అతను. ఇంకోడు నాగభూషణం. మరొకడు నాగేంద్రరావు. ఆనందరావు మరేం అనలేక పోయాడు. ఎవడి పాపం వాళ్లే అనుభవిస్తారు అనుకున్నాడు.

"మీ యిష్టం. పట్టుబడితే ఫలితం మీరే అనుభవించాల్సి ఉంటుంది...."

"ఓ!" అన్నారు వాళ్లు కోరస్‌గా.

ఆరాత్రి ఎవరో వచ్చారంటే, లేచి వాకిట్లోకి వెళ్లాడు. నల్లతుమ్మ చెక్కలా ఆరడుగుల మనిషి, తెల్లపంచె, గ్లాస్కో లాల్చీ, దివి తాలూకా మనిషి నని, ఏదో వ్యాపారం చేసుకుంటున్నానని చెప్పాడు.

"ఆహా!" అన్నాడు ఆనందరావు.

"చూడండి... ఈరోజుల్లో గవర్నమెంటు ఏపనీ చేసుకోనివ్వడం లేదండీ. మమ్మల్ని బాగు చెయ్యదు, తను బాగు పడదు...."

"ఇంతకీ....."

"ఇవాళ రాత్రి మా లారీలు బందరు రోడ్డు దాటాలి బాబూ!"

"ఏం? రోడ్డు మరమ్మత్తులో ఉందా? అయినా అది మా డ్యూటీ కాదు.."

"చూడండి. ఇవి చేతులు కావు, కాళ్లు. ఇప్పటికే వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. మిగిలిన ఆస్తి అమ్మి నలుగుర్ని పోగేసి ఐదు లక్షలు ఇందులో పెట్టాను. ఆ లారీలు ఆ చెక్‌పోస్టంట... అది దాటి వెళ్లే ఏర్పాటు చేసి పెట్టాలి బాబూ.."

"ఇదేమిటయ్యా, నాకేం సంబంధం లేదు" అన్నాడు ఆనందరావు.

"అలా అనకండి బాబూ. నాగేంద్రంగారు చెప్పారు. ఆ చెక్‌పోస్టులో ఆయన, మీ చుట్టం అని....."

"అయితే?"

"లక్ష రూపాయలు మీవి బాబూ." తీసి బల్లమీద పెట్టబోయాడు.

ఆనందరావు అరిచాడు..."ఆ డబ్బుతీసెయ్యి."

వాడు కదలలేదు.


"వెళ్లిపో!" అన్నాడు నెమ్మదిగా....

"పని, జయం అయ్యాకా కలుస్తా బాబూ!" వాడు వెళ్లిపోయాడు.

ఆనందరావుకు తలలో నిప్పులు ప్రవహించడం మొదలుపెట్టాయి. నాగేంద్రం తనను ఇరకాటంలో పెట్టాలని ఊహించి ఉంటాడు.డబ్బుతో తన నోరు ముయ్యాలని వాళ్ల ఆశ. ఒళ్లు కోపంతో కాగిపోతున్నది. ఫోన్‌తీసి ఎవరితోనో మాట్లాడాడు, తీక్షణంగా.

తెల్లవారింది... కృష్ణవేణి కాఫీ కలిపి ఇచ్చింది. కాఫీ తాగుతూ పత్రిక తెరిచాడు ఆనందరావు. "విజయవాడ చెక్‌పోస్ట్ వద్ద ఐదు లక్షల విలువ జేసే దొంగ సరుకులు స్వాధీనం. ఆస్తి తాలూకు మనిషి అయిన ఆదిశేషయ్య పరారీ....."

ఆనందరావు కళ్లు బైర్లు కమ్మాయి. ఆదిశేషయ్య, ఆదిశేషుడు. ఇది తను చేసిన పనే. వాడిప్పుడు తన్నేమన్నా చేస్తే...భార్యను పిలిచాడు. సలహా అడిగాడు. కృష్ణవేణి ధైర్యం చెపుతున్నది. పోలీసులకు కబురు చెయ్యమంది. అయినా ఏదో పిరికితనం పుట్టకురుపులా లోపల రేగుతున్నది... దాని బాధ ఒకరి ఉపశమనంతో తొలగేది కాదు. తనే నయం చేసుకోవాలి. ధైర్యం తెచ్చుకున్నాడు. తన దగ్గరికి ఆదిశేషయ్య ఎలాగూ వస్తాడు.



ఆలోచనా వలయం

చిత్రం—దావరి నాగవర్ధనరావు (గుంటూరు-1)

అతన్ని తను రక్షించగలడు. ఎందుకు రక్షించాలి? మనుష్యులు మనుష్యులే గాని విషజంతువులు కారు. ఇలా క్షణక్షణానికీ భీతి పెట్టుకుంటే తన జీవితం, ఉద్యోగం, కార్యనిర్వహణ ఏమయిపోవాలి? అది అనవసరం తనకు. తనలో కొన్ని భయాలూ, నమ్మకాలూ ఉన్నాయి. వాటి నెప్పుడూ తను ఎదుర్కోడు. మృత్యువుతో సరసం తన కనవసరం. ఏమయినా ఆదిశేషయ్యను రక్షించాలి. ఆపైన ఈ ఉద్యోగం వదిలి మరొకటి చూసుకోవాలి.....

రాత్రి ఎనిమిదయింది. ఆదిశేషయ్య రాలేదు. ఆనందరావుకు భయంతోపాటు దైవభక్తి కలిగింది. ఒక్కసారి తను దుర్గను దర్శించుకోవాలి. ఈ రోజు ఒక్కరోజే తను జీవితంలో పొరపాటుగా ప్రవర్తించిందీ, విషజంతువును కదిలించిందీను. నెమ్మదిగా బయలుదేరాడు. బజారు కలకలంలో కరిగిపోతున్నది. అందరూ తెగ తిరుగుతున్నాయి. ఆనందరావు నడుస్తున్నాడు నిర్జీవంగా. పాముకాటుకు మందు అంటూ వేన్‌మీద ఎడ్వర్టయిజుమెంట్లు... పాములవాడు భుజంమీద త్రాచుపాము వేసుకుని డబ్బులు అడుక్కుంటున్నాడు. కిళ్లీషాప్‌లో తగిలించిన పత్రికమీద పాము ముఖచిత్రం...సినిమా వాల్ పోస్టర్లమీద పాము ముందు స్త్రీ ప్రార్థన... ఆనందరావు కళ్లు మూసుకున్నాడు. అచేతనంగా నడిచి గుడికి వెళ్లి పూజ ముగించుకుని కొండ దిగిపోయాడు. బేరేజీమీద కాస్త వెలుగు తనలోకన్నా ఎక్కువగా ఉంది. చీకటిని జయించి నట్లుయ్యింది బేరేజీమీద లైట్లను చూస్తూంటే. జనం పలచబడ్డారు. చుట్టూ నిశ్శబ్దం నివాళి పడుతున్నది.

"నువ్వా?" అన్నాడు ఆనందరావు తుమ్మ చెక్కలా నల్లగా ఉన్న ఆదిశేషయ్య తన ముందు నిలబడగానే.

"నా పొట్ట కొడతావా...దుర్మార్గుడా?"

ఆనందరావు ఏదో చెప్పాలనుకునే లోపలే అతని మెడమీద, గెడ్డంమీద బలంగా గుద్దాడు ఆదిశేషయ్య. సరాగ్గా నిలబడ్డ ఆనందరావు త్రుళ్లిపడ్డాడు. కాళ్లు పట్లు తప్పాయి. చీకటిలో ప్రవహించే కృష్ణానదిలోకి అంత ఎత్తు నుంచి, అర్థంకాని రోదనతో, ఆవేదనతో ఆనందరావు పడిపోయాడు. ఆనందరావును కాటేసి భయంగా పారిపోయాడు ఆదిశేషయ్య.

బేరేజీమీద చలనం లేకుండా పహరా కాస్తున్న కాంతి, చీకటిలో అనంతంలోకి నడిచి పోతున్న కృష్ణవేణీమాత్రం ఆనందరావు చావు చూశాయి. కానీ వాటికి మాటలు రావు. తెల్లవారిన తరువాత ఏ చెట్టుకో పుట్టకో తగులుకున్న శవం ఏమని చెబుతుంది తన చావు గురించి? ఏమని చెప్పగలదు ఆనందరావు చలనంలేని శరీరం? పాపం! జీవితంలో మూడో గండం తప్పించుకోలేకపోయాడు ఆనందరావు. లేక తప్పించుకోగలిగాడా? ఏమో! దీనికి ఆనందరావే సమాధానం చెప్పగలడు. కానీ, ఎలా? ★